పోరాటాలకు సిద్ధం కావాలి

- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలో నేతల పిలుపు

మాట్లాడుతున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమ్మెకాలపు హామీలు అమలు కోసం, భారమైన యాపుల రద్దు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రమాదేవి సూచించారు. శనివారం ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 10వ జిల్లా మహాసభ కర్నూలు కార్మికకర్షక భవన్‌లో రేణుకమ్మ, వరలక్ష్మి, జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా యూనియన్ జెండాను గౌరవాధ్యక్షులు పి.నిర్మల ఆవిష్కరించారు. రమాదేవి, పి.నిర్మల మాట్లాడుతూ పోరాటాల తోనే ఐసిడిఎస్ పరిరక్షణ ఉద్యమంసమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసిడిఎస్) పరిరక్షణకు అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసి 50 యేళ్లవుతుందని, ఈ కాలంలో ప్రభుత్వాలు ఈ స్కీమ్‌ను నిర్వీర్యం చేయటానికి అనేక ప్రయత్నాలు చేశాయన్నారు. దేశంలో ఆకలి చావులు పెరుగుతున్నా స్కీమ్‌ను బలోపేతం చేయడానికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. ఏటా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తుందని, బిల్లులు సకాలంలో విడుదల చేయట్లేదన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు కూడా ఇవ్వట్లేదన్నారు. ప్రధాని మోడీ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వా డీల వేతనాలు పెంచుతామని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేస్తామని వాగ్దానం చేశారని, మూడు సార్లు అధికారంలోకి వచ్చినా చిల్లి గవ్వ పెంచలేదన్నారు. పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి అంజిబాబు అంజిబాబు మాట్లాడుతూ దేశంలో మాతా శిశు మరణాలు, ఆకలిచావులు, నిరుద్యోగం పెరుగుతుంటే పాలకులు అచ్చేదిన్ అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. ఐసిడిఎస్ ద్వారా పేద గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఎంతో మేలు జరిగిందని అనేక నివేదికలు స్పష్టం చేశాయన్నారు. ఇప్పటికైనా ఈ పథకం ప్రభుత్వాలు బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ నివేదిక ప్రవేశపెట్టారు. జిల్లాలో అంగన్‌వాడీ హెల్పర్ ప్రమోషన్లు ఏడాదిన్నర కాలంగా పక్కన పెడితే యూనియన్ సుదీర్ఘ పోరాట ఫలితంగా ప్రమోషన్లు సాధించుకున్నామన్నారు. రానున్న కాలంలో యూనియన్‌ను మరింత బలోపేతం చేసుకొని హక్కుల కోసం పోరాడాలన్నారు. మహాసభలో అంగన్‌వాడీలకు కనీస వేతనాలు రూ.26వేల ఇవ్వాలని, ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, అంగన్ వాడీ లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, యాప్‌ల పనిభారం తగ్గించాలని పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ మహాసభ లో శైలజ, ప్రభావతి, బాలదరగమ్మ, పద్మ, బాల రంగమ్మ, వరాలమ్మ, కృష్ణవేణి, సుజాత, సిఐటియు నగర నాయకులు కె.ప్రభాకర్, మహమ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌గా డాక్టర్ ఎ.సిరి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ ఎ. సిరి శనివారం కలెక్టరేట్లో కలెక్టర్ చాంబర్‌లో బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు ఆశీస్సులు అందచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రధానంగా ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడం, తాగునీటి సమస్య పరిష్కారం, భూగర్భ జలాల పెంపు అంశాలపై కూడా దృష్టి పెడతామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ ద్వారా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కు కృషి చేస్తామని తెలిపారు. పిజి ఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. తదనంతరం నూతన కలెక్టర్ కు జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, జిల్లా అధికారులు, పుష్పగుచ్ఛాలతో జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు.

సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి చేద్దాం

- జిల్లా అధికారులతో విస్తృత సమీక్షలో కలెక్టర్

సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి చేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఎ. సిరి బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ ఎ.సిరి

విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్లుగా నియమితులైన వారందరితో ముఖ్యమంత్రి మాట్లాడారని, జిల్లాలను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దాలని ఆదేశించారన్నారు. కోర్టు కేసులు, ఆర్‌టిఐ అంశాల్లో అలసత్వం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో వేగం ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరణ ముందు బదిలీ అయిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశంలో జెసి బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టమోటా రైతు దిగాలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

టమోటా రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. బహిరంగ మార్కెట్లో కిలో రూ.25 నుంచి రూ.30 వరకూ ధర ఉండగా రైతుకు రూ.6 మాత్రమే లభిస్తోంది. దీంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, క్రిష్ణగిరి వెల్దుర్తి మండలాల్లో రైతులు అధికంగా టమోటా సాగు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి టమోటా మార్కెట్ తర్వాత కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్లోనే టమోటా క్రయవిక్రయాలు అత్యధికంగా సాగు తున్నాయి. పత్తికొండ నుండి తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఎకరా విస్తీర్ణంలో టమోటా సాగుకు రూ.50 వేల వరకూ ఖర్చవుతోంది. ఒక ఎకరాలో ఏడు కోతల వరకూ పంట వస్తుంది. బాగా పంట పడితే కోతకు వెయ్యి కిలోల వరకూ దిగుబడి వస్తుంది. ఏడు కోతలకు కలిపి ఏడు వేల కిలోల వరకూ దిగుబడి వచ్చినా కిలో రూ.6 లెక్కన రైతుకు రూ.42 వేలు మాత్రమే దక్కుతుంది. ప్రస్తుత ధరను బట్టి రూ.8 వేల వరకూ నష్టం వస్తోంది. కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్లో కిలో రూ.20 వరకూ ధర ఉంది. ఇతర జిల్లాల్లో రూ.25 నుంచి రూ.30 వరకూ అమ్ముతున్నారు. పత్తికొండ మార్కెట్లో నలుగురు వ్యాపారులు ఉన్నారు. వీరు సిండికేటై ధర తగ్గించేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని విమర్శిస్తున్నారు. నంద్యాల జిల్లా ప్యాపిలి టమోటా మార్కెట్లోనూ రైతుకు ధర దక్కడం లేదు. ఇక్కడ కూడా శు క్రవారం 25 కిలోల బాక్స్ రూ.150 మాత్రమే లభించింది. ఈ లెక్కన కిలో రూ.6 మాత్రమే పలికింది. రైతులు నష్టపోతుండగా వ్యాపారులు లాభాలు ఆర్జిస్తున్నారు. వర్షాలు వచ్చి నప్పుడల్లా టమోటా ధర పతనమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని గిట్టుబాటు కల్పించాలని కోరుతున్నారు.

ఉల్లి రైతులదీ అదే దారి..

ఉల్లి కొనుగోళ్లలో నిబంధనలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మూడు రోజులే కొనుగోలు చేసింది. ఆ తర్వాత నుంచి వ్యాపారుల దయా దాక్షిణ్యాలకే వదిలేసింది. క్వింటాలు ఉల్లిని రూ.1,200 కంటే తక్కువకు వ్యాపారులు కొంటే, ఆ వ్యత్యాసపు ధరను తర్వాత భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. మిర్చి విషయంలోనూ ప్రభుత్వం అప్పట్లో ఈ విధంగా హామీ ఇచ్చినా అమలు కాలేదు. అదే విధంగా ఉల్లి బోనస్‌కు సంబంధించి ఏడేళ్ల క్రితం బకాయిలు ఇప్పటికీ చెల్లింపు జరగ లేదు. దీంతో ప్రభుత్వ మాటలపై ఉల్లి రైతుల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎకరం విస్తీర్ణం లో ఉల్లి సాగుకు రూ.1.50 లు లక్షల వరకూ ఖర్చవుతోంది. గతేడాది గరిష్టంగా క్వింటాలుకు రూ.3,989 రాగా, ఈ ఏడాది రూ.1,599 మాత్రమే వచ్చింది. గతేడాది కనిష్టంగా క్వింటాకు రూ.679 రాగా, ఈ ఏడాది రూ.501కి ధర పడి పోయింది. దీంతో రైతులు రోడ్డెక్కడంతో ప్రభుత్వం స్పందించి క్వింటాలు ఉల్లిని రూ.1200 కు మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేయించింది. ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుంచి 3 వరకు మొత్తం 1,226 టన్నుల ఉల్లిని మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసింది. నిల్వ చేసుకోవడానికి అవకాశం లేదనే సాకుతో 4వ తేదీ నుంచి కొనుగోలు నిలిపివేసింది. వ్యాపారులకే అమ్ముకోవాలని తేల్చి చెప్పింది. ట్రేడర్లు రూ.1200 కంటే తక్కువకు కొనుగోలు చేస్తే ఆ వ్యత్యాసం మొత్తాన్ని బోనస్‌గా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకంతో పాటు రైతు భరోసా కేంద్రం నుంచి ఇ-క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రం సమర్పించా లని నిబంధన పెట్టింది. దీంతో ఇ-క్రాప్ నమోదు చేయని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలు జరిగాయి. కలెక్టర్ రంజిత్ బాషా బదిలీ అయ్యారు. కొత్త కలెక్టర్‌గా ఎ.సిరి బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ డోన్‌లో పర్యటించారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటించారు.

కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం

- సీతారామ్ ఏచూరి వర్ధంతి సభలో ఎంఏ.గఫూర్

సీతారామ్ ఏచూరికి నివాళ్లులర్పిస్తున్న ఎంఏ.గఫూర్, కె.ప్రభాకర్ రెడ్డి, డి.గౌస్‌దేశాయ్ తదితరులు

కార్పొరేట్, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే సీతారామచూరికి అర్పించే ఘనమైన నివాళి అని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ అన్నారు. శనివారం సిపిఎం పూర్వపు ప్రధాన కార్యదర్శి, సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా "వర్తమాన రాజకీయాలు- సిపిఎం వైఖరి" అంశంపై సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. (వార్త మెయిన్‌లో..)

15 నుండి 19 వరకు యుటిఎఫ్ రణభేరి

- కర్నూల్ నుండి ప్రారంభం కానున్న జాతా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 15 నుండి 19వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాల విద్యారంగా పరిరక్షణపై ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించరాదని కోరుతూ రణభేరి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన యుఆర్ఎ రవికుమార్ నవీన్ పాటిలు వెల్లడించారు. ఈనెల 15న సోమవారం ఉదయం 9 గంటలకు కర్నూలు నుండి ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శనివారం కర్నూలు యుటిఎఫ్ కర్నూలు జిల్లా కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ యుటిఎఫ్ రణభేరి కార్యక్రమం కర్నూలు నుండి ప్రారంభమై పత్తికొండ వరకు కొనసాగిన అనంతరం ముగుస్తుందన్నారు. అనంతరం ఇక్కడి నుండి అనంతపురం జిల్లాలో గుంతకల్లుకు బయల్దేరి వెళుతుందన్నారు. ఈ జాతా కర్నూలు నగర శివారులోని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందర్శించి అనంతరం కోడుమూరు మీదుగా గోనగండ్లకు చేరుకొని అక్కడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శిస్తుందన్నారు. అనంతరం ఎమ్మిగనూరుకు చేరుకొని అక్కడ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సందర్శన అనంతరం కైరుప్పల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పత్తికొండలో కొంతసేపు ఉండి అనంతరం అక్కడి నుండి అనంతపురం జిల్లాలోని గుంతకల్లుకు ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. ఈ జాతా జరిగే ప్రాంతాల్లో యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు సమస్యలను కూడా జాతీయ బృందం స్వీకరిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న బాబు రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

పత్తికొండ మార్కెట్‌లో టమోటా పారబోసిన రైతులు

మార్కెట్‌లో రైతు కింద పారబోసిన టమోటా

తుగ్గలి మండలం గిరిగెట్ల గ్రామానికి చెందిన ఓ రైతు దాదాపు 60 గంపలు (ఒక గంప 25 కిలోలు) మార్కెట్‌కు తీసుకుని వస్తే వ్యాపారస్తులు జతగంపలకు 50కిలోలకు రూ.50తో కిలో రూ.1 కొనుగోలు చేశారు. కడుపు మండి పత్తికొండ టమోట మార్కెట్‌లో ప్లాట్ ఫారంపై పారబోసి డబ్బులు తీసుకోకుండా ఖాళీ గంపలను నెత్తి మీద పెట్టుకొని కన్నీళ్లు కారుస్తూ వెళ్లారు. (వార్త మెయిన్‌లో..)

లక్ష్య సాధనతో ముందుకెళ్లాలి : ఐఐఎఫ్

ప్రజాశక్తి- సిబెళగల్ : విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకెళ్లాలని ఇన్‌పుట్ ఇంటర్ నేషనల్ ఫౌండేషన్ నిర్వాహకులు గంపా నాగేశ్వరావు , చైతన్య కారుడు కె.మహేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం సి బెళగల్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ చింతలయ్య సమక్షంలో పది, ఇంటర్ విద్యార్థులతో లక్ష్య సాధన సదస్సు నిర్వహించారు. ప్రాథమిక విద్య దశలో క్రమశిక్షణతో పాటు వినయంతో మెలగాలని కౌమార దశ విద్యలో విజ్ఞానంతో కూడిన వివేకం అలవరచుకోవాలన్నారు. కిషోర దశలో అంటే ఇంటర్ లో భవిష్యత్తులో స్థిర పడేందుకు నిర్దేశితమైన దిశగా విద్యలో రాణించి క్రీడల్లో ఔత్సాహికత చాటాలన్నారు. యవ్వనదశలో నిజ జీవితంలో స్థిర పడుటకు నేర్పరిగా మంచి స్థితిలో ఏకాగ్రతతో మెలిగితే భవిష్యత్తు మీదేనని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజశేఖరరెడ్డి, లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాత టైం టేబుల్ ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో ఉపాధ్యాయులకు పాత టైం టేబుల్ ప్రవేశపెట్టాలని ఎస్‌టియు గురుకుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. శనివారం కర్నూలు స్థానిక సలాంఖాన్ భవన్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల ఉపాధ్యాయుల జిల్లా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మీనారాయణ జిల్లా అధ్యక్షులు యు. ప్రదీప్ లు మాట్లాడారు. గురుకులాలలో క్వార్టర్స్ లేవన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌టియు గురుకులాల విభాగం నాయకులు నబీరసూల్, సంఘం రాష్ట్ర కార్యదర్శి కిరణ్ రాజు నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, నరసింహస్వామి, మునెయ్య, విజయ భాస్కర్.. గురుకుల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం కలిగేలా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చేందుకు ప్రజల్లో చైతన్యం కలిగేలా సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. శనివారం నగరపాలక కార్యాలయంలో సామాజిక మాధ్యమాల ప్రభావితులతో (సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు) సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగర అభివృద్ధి, పరిశుభ్రత, పచ్చదనం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వంటి అంశాల్లో ప్రజల్లో చైతన్యం కలిగించడానికి విస్తృత ప్రచారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మరింత బలపరిచేందుకు 'వియ్ ఫర్ కర్నూలు) పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ప్రజల్లో చైతన్యం పెంచేలా సామాజిక మాధ్యమాల ప్రభావితులు వినూత్నమైన, ఆకర్షణీయమైన పోస్టులను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. రాబోయే 100 రోజుల్లో సరికొత్త ఆలోచనలతో ప్రజలను చైతన్యపరుస్తున్న ప్రభావితులను "రెస్పాన్సిబుల్ సిటిజన్" అవార్డును ప్రజా ప్రతినిధుల సమక్షంలో అందజేస్తామన్నారు. కర్నూలును ఒక మోడల్ సిటీగా తీర్చిదిద్దడంలో అందరూ కలసి కషి చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. నగరంలో దాదాపు రూ.124 కోట్ల పెండింగ్ రెవెన్యూ వసూళ్లు ఉన్నాయని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించేలా ప్రత్యేక ప్రచారం చేయాలని సూచించారు. మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ప్రభావితులు అఖిల్, అమీన్, కోమల్, నవీన్ రెడ్డి, రాఘవేంద్ర, సూర్యప్రకాష్, అక్బర్, సురేష్, నితిన్, సాయినాథ్, రషీద్, రాజేష్, అబ్దుల్లా పాల్గొన్నారు.

తొలి తెలుగు పత్రిక సంపాదకులు గాడిచర్ల

- నేడు గాడిచర్ల 143వ జయంతి



ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

తొలి తెలుగు పత్రిక సంపాదకులు, ఆంధ్రాతిలక్‌గా పేరొందిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు మన కర్నూలు వాసి కావడం మనందరికీ గర్వకారణం. స్వరాజ్యపోరులో గాంధేయవాదాన్ని బలంగా అనుసరించిన మహోన్నత సమరయోధుడు. 1883 సెప్టెంబర్ 14న కర్నూలులోని వెంకటాద్రి, భగీరథిబాయి దంపతులకు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జన్మించారు. విద్యార్థిదశలో ప్రధానోపాధ్యాయులు రఘునాథాచార్యుని ప్రభావంతో జాతీయోద్యమంపై మొగ్గు చూపించారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు మద్రాసుకు వెళ్లారు. మద్రాసు కామరాజు క్రిస్టియన్ కళాశాలలో పిజి పూర్తిచేశారు. ఆ సందర్భంలోనే అయ్యదేవర కాళేశ్వరరావు, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య గార్ల పరిచయమయ్యింది. అప్పటికే తెలుగు ఆంగ్లభాషల్లో గొప్ప పాండిత్యం సంపాదించుకున్నారు. 1907వ సంవత్సరంలో శిక్షణ నిమిత్తం రాజమండ్రిలో ఉన్నప్పుడు వందేమాతరం ఉద్యమంలో భాగంగా పాల్గొన్న బిపిన్ చంద్రపాల్ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించారు. 'స్వరాజ్య' పత్రికలో ఆయన రాసిన సంపాదకీయ వ్యాసాలు బ్రిటీష్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టించాయి. 1908లో పదునెక్కిన పదజాలంతో, జనసామాన్యంలోకి చొచ్చుకెళ్ళే బాషతో సంపాదకీయం రాసిన గాడిచర్లకు బ్రిటిష్ ప్రభుత్వం మూడేళ్ళ జైలుశిక్ష విధించింది. అదే రోజున లోకమాన్య బాలగంగాధర తిలక్‌కు కూడా జైలుశిక్ష పడింది. జైలుశిక్ష అనంతరం 1914 నుండి 1916 వరకు ఆంధ్రపత్రికకు 1919లో ది నేషనలిస్ట్ పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. సంపాదకులుగా ఆయన రాసిన సంపాదకీయాలు ప్రజల్లో దేశభక్తిని, చైతన్యాన్ని కలిగించాయి. జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని ది నేషనలిస్ట్ పత్రికలో రాసినందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఆ పత్రికనే నిషేదించింది. స్వరాజ్యం కోసమే కాకుండా సామాజిక రంగాల్లోను, సాహిత్య రంగంలోనూ విశిష్ట సేవనందించారు. పత్రికల్లో పనిచేస్తూనే రచయితగా రాణించారు. ఆంధ్రకేసరి నవయుగం, ఆంధ్రపత్రిక, సౌందర్యవల్లి, మాతృసేన, గ్రంథాలయ స్వరం, సహకార గ్రామ పంచాయితీ, పంచాయితీ రాజ్యం, ఆంధ్ర వార్త వంటి పత్రికలతో ఉన్న అనుబంధంతో వాటిలోనూ వ్యాసాలు రాశారు. ప్రచ్ఛన్న పాలన శ్రీరామచరితం అనే గ్రంథాలురాసి విశిష్టమైన రచయితగా సాహిత్యరంగంలో చెరగని ముద్రవేశారు. 1916 సెప్టెంబర్ 1న అనిబిసెంట్ ప్రారంభించిన హోంరూల్ ఉద్యమంలో భాగంగా ఆంధ్రా హోంరూల్ లీగ్‌కు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదే సందర్భాంలోనే దినేషనలిస్ట్‌లో రాసిన వ్యాసం వల్ల ఆ పత్రిను నిషేదించారు. 1921 సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో గాంధీజీ కర్నూలు, ఆదోని ప్రాంతాల్లో పర్యటించగా మహాత్మగాంధీ హిందీ ప్రసంగాలను గాడిచర్ల తెలుగులోకి అనువదించారు. 1928లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా కర్నూలు మున్సిపాలిటీ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భంలోనే నవంబర్ 17, 18 తేదీల్లో నంద్యాలలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి అనిబిసెంట్, సర్వేపల్లి, టంగుటూరి ప్రకాశం పంతులు, కాశీనాథుని వంటి ప్రముఖులతో కలిసి హాజరై దత్తమండలాలుగా వ్యవహరిస్తున్న ప్రాంతానికి రాయలసీమ అని నామకరణం చేయాలని ప్రతి పాదించారు. వయోజన విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ, గ్రంథాలయోద్యమ పితామహుడిగా ఉద్యమాన్ని నడిపారు. పత్రికా రంగంలో ఎనలేని సేవచేశారు. పత్రికలకు వెన్నముక లాంటి సంపాద కీయాలను జనరంజకంగా ఉద్యమ పంథాలో, స్ఫూర్తి దాయకంగా రాసి తెలుగుపత్రిక సంపాదకుల్లో అగ్రస్థానం సంపాదించు కున్నారు. శ్రీ బాగ్ ఒడంబడికకు, ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలలో గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ముందు వరుసలో ఉన్నారు. కర్నూలును రాజధాని చేయాలన్న డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో స్ఫూర్తిదాత గాడిచర్ల వారే. 1960 ఫిబ్రవరి 29న మరణించిన గాడిచర్ల తెలుగుజాతి గర్వించదగ్గ అణిముత్యం.

డాక్టర్ మన్నం వెంకటరాయుడుకు గాడిచర్ల పురస్కారం : కల్కూర

స్వాతంత్ర్య సమరయోధులు గాడిచర్ల సర్వోత్తమరావు 143వ జయంతి వేడుకల్లో భాగంగా కర్నూల్లోని పింగళిసూరన తెలుగుతోటలో ఆదివారం ఉదయం 10.00లకు గాడిచర్ల ఫౌండేషన్, ఎపి గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో మనసు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ మన్నం వెంకటరాయుడుకు గాడిచర్ల స్మారక పురస్కారం అందిస్తున్నామని గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర తెలిపారు.

సమాజాభివృద్ధికి తోడ్పడాలి : మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సమాజ అభివృద్ధికి మీడియా రంగం తోడ్పడాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం కర్నూలు నగరంలోని పరిణయ ఫంక్షన్ హాలులో ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి టిజి.భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఎఐ వంటి సాంకేతికత పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు. దీనిని జర్నలిజం రంగంలో వినియోగించుకొవాలని కోరారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియాలో ఇబ్బడి ముబ్బడిగా సమాచారం ఉంటోందని, అందులో కొంత అవాస్తవాలు కూడా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు మంచి సమాచారాన్ని అందించాలని మంత్రి సూచించారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ మనిషి ఎప్పటికీ నిత్య విద్యార్థి అని, ఎప్పటికప్పుడు వత్తి నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఇంటర్నెట్ వచ్చిన తర్వాత సోషల్ మీడియా విస్తృతంగా అభివద్ధి చెందిందన్నారు. తద్వారా ప్రజలందరూ జర్నలిస్టులుగా సమాచారాన్ని అందిస్తున్నారన్నారు. ఇందులో మంచి , చెడు రెండూ ఉన్నాయని తెలిపారు. సమాజంలో జరుగుతున్న మంచిని ప్రజలకు తెలియజేయడంతో పాటు చెడును సరిదిద్దే దిశగా వార్తలను రాయడం జర్నలిస్టుల కర్తవ్యమని స్పష్టం చేశారు. సెక్రటరీ మణిరామ్, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, ఉపాధ్యక్షులు కొండప్ప, జాతీయ సభ్యులు వెంకట సుబ్బయ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు గౌడ్, శ్రీనివాసులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

వన్నెం బలరాం, జెఎన్ శేషయ్యలకు జోహార్లు అర్పిస్తున్న కళాకారులు

బలరాం, జెఎన్ శేషయ్య చిరస్మరణీయులు

- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ : రాష్ట్ర నంది అవార్డు గ్రహీత వన్యం బలరాం, కళా సేవకులు జెఎన్ శేషయ్య సంస్మరణ సభ కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పింగళి సూరన తెలుగు తోటలో శనివారం నిర్వహించారు. జిల్లా రంగస్థల కళాకారులు కీర్తిశేషులు నంది అవార్డు గ్రహీత వన్నెం బలరాం, కళా సేవకులు, జెఎన్.శేషయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సంస్మరణ సభ కార్యక్రమంలో వక్తలు, కళాకారులు కారణజన్ములు, కళాకారులు చిరంజీవులని ప్రశంసించారు. కళాకారులు వన్నెంబలరాం, నర నారాయణ పౌరాణిక పద్య నాటకానికి శకుని పాత్రను అద్భుతంగా పోషించి, నాటి చలనచిత్ర నటులు ధూళిపాల శభాష్ అని మెచ్చుకునే తీరు నటించి, రాష్ట్ర నంది అవార్డును పొందినారు. బావ ఎప్పుడు వచ్చితివి సాంఘిక నాటకంలో తనదైన పాత్రలో హాస్య పాత్రను పండించిన ఘనుడు వన్యం బలరామ్ అన్నారు. సహజనటులు, దర్శకులు, సహాయ దర్శకులుగా లలిత కళా సమితి సభ్యులుగా అభినందనలు అందుకున్నారు. సమాజ సేవకులు కళా సేవకులు జెఎన్ శేషయ్య కళాకారుల కోసం నిరంతరం పోరాటాలు, సాగించి విద్యా వైద్యం అందించుటలో తనదైన శైలిలో కృషి చేశారన్నారను. రంగస్థల కళాకారుల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారన్నారు. లలిత కళా సమితికి శేషయ్య సభ్యులుగా కొనసాగారని ఒకరు కళా రంగంలోనూ మరొకరు సేవారంగంలోనూ పోటీపడి పని చేశారనికొనియాడారు. సభలో వివిరమణ రెడ్డి, డి.దస్తగిరి, బైలుప్పల షఫీయుల్లా, పి హనుమంతరావు చౌదరి, సయ్యద్ రోషనలి, సిబి అజయ్ కుమార్, ఎలమర్తి రమణయ్య, రుక్మాంగద రెడ్డి ప్రసంగించారు. సంస్మరణ సభలో రంగస్థల కళాకారులు మహమ్మద్ మియా, శ్యామ్యూలు, ఎలమర్తి రమణయ్య, పాటలను పద్యాలను ఆలపించారు. సంతాప సభలో రంగస్థల కళాకారులు డి.పార్వతయ్య, డి.పుల్లయ్య, డిఎన్వి సుబ్బయ్య, లక్ష్మీకాంతం, ఎం.మనోహర్ బాబు, షేక్షావలి, ముంతాజ్, గంగాధర్, ఎం.భీన్న, మురళి, రమణ చారి, పాల్గొన్నారు.

బుధవార పేటలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు నగరంలో అతిపెద్ద దళితవాడ బుధవారపేటలో శనివారం రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి పర్యటించారు. కాలనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్ విన్నవించారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తారని తెలిపారు.

అంబేద్కర్ భవన సాధనకు పోరాటం

- బాబూ జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- డిసెంబర్ లో 5 వేల మందితో... "దళితుల ఆత్మ గౌరవ సభ
- దళితుల ఆత్మీయ సమ్మేళన సభలో నేతలు

ప్రజాశక్తి : ఎమ్మిగనూరు

ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 'డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్' నిర్మాణం కోసం దళితులంతా ఏకమై పార్టీలకతీతంగా ఉద్యమించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. దేవసహాయం, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య మాదిగలు పేర్కొన్నారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలో కుర్ని కళ్యాణ మండపం నందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటి ఆధ్వర్యంలో 'దళితుల ఆత్మీయ సమ్మేళన సభ'ను నిర్వహించారు. ఈ సభకు ఎమ్మిగనూరు నియోజకవర్గ నలుమూలల నుండి ఎస్‌సిలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సభలో నాయకులు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ GO.MS.No: 35 SWS (Bui-1) డిపార్ట్ మెంట్ ప్రకారం అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు గ్రాంట్ ఉండడంతో ఈ నిధులు సరిపోవడం లేదన్నారు. ఎస్‌సిలకు సరిపడే భవనం నిర్మించాలంటే ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మిగనూరు పట్టణంలో రిక్రియేషన్ క్లబ్ ఎదురుగా పార్క్ రోడ్డు డివైడర్‌లో భారత మాజీ ఉప ప్రధాని, దళితుల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమర యోధులు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటుకు 2012 లో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం నెంబర్:153 ఆమోదించిందన్నారు. దీని మేరకు మహనీయుడు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. పెండింగ్ లో ఉన్న జగ్జీవన్‌రామ్ కాలనీ ముఖద్వారం (ఆర్చి) నిర్మాణం, దామోదరం సంజీవయ్య కాలనీ బోర్డుపనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌సిలలోని 59 ఉపకులాలలో ఒకరైన బేడ, బుడగ జంగాలకు అడ్డుగా ఉన్న 144 జీవో రద్దు కోసం ఢిల్లీ యాత్ర చేపడతామన్నారు. భారతదేశంలో దళిత, గిరిజనులకు అంబేద్కర్, జగ్జీవన్ రామ్‌లు రెండు కళ్ళు లాంటి వాళ్ళని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంబేద్కర్ భవన నిర్మాణం ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బివి. జయ నాగేశ్వర రెడ్డి గారు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మా డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్‌ను కలిసి విన్నవిస్తామన్నారు. టిడిపి ఎస్‌సి సెల్ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ హాలహర్వి దావీదు ఈ కార్యక్రమానికి ఈ రెండు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి దళితుల అభ్యున్నతికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. కళాకారులు కత్తి రంగన్న, కరుణాకర్ పాడిన పాటలు సబికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఆత్మీయ సమ్మేళనసభలో అభివాదం చేస్తున్న నేతలు దేవసహాయం, ఆదెన్న, తదితరులు

డిసెంబర్ లో 5 వేల మందితో 'దళితుల ఆత్మగౌరవ సభ"

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం కోసం రూ.2 కోట్లు నిధులు మంజూరు, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహం ఏర్పాటులో ఏమాత్రం జాప్యం జరిగినా డిసెంబర్ మొదటి వారంలో ఎమ్మిగనూరు పట్టణంలో డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గర 5 వేల మంది దళితులతో "దళితుల ఆత్మగౌరవ సభ" ను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత రచయితల సంఘం (ద.ర.సం) వ్యవస్థాపకులు ఆరెకంటి భాస్కర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి మహదేవ్ మాదిగ, ఇలాడి జయమ్మ మాదిగ, కెవిపిఎస్ నాయకులు సప్పోగు తిమ్మన్న, సుమాల అంతోని, కలుగోట్ల మాల రాజా రమేష్, సుమాల మెకానిక్ రాజు, ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గోనెగండ్ల కరుణాకర్, మాల మహానాడు నాయకులు మాజీ కౌన్సిలర్ మాల మధుబాబు, మాలసత్య, పూలే అంబేద్కర్ ఐడియాలజీ కోఆర్డినేటర్ ఏసీ దేవదానం, బేడ బుడగ జంగం నాయకులు సంకుల మహాలింగప్ప, రుద్రాక్షల బజారి, రుద్రాక్షల దస్తగిరి, కలుగొట్ల నడిపన్న, టిడిపి నాయకులు హాలహర్వి ప్రభుదాసు, ముగతి నరసన్న, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ నాయకులు కదిరికోట వెస్లీ సునీల్, న్యాయవాది హిజి కియా, దళిత నాయకులు గుడికల్ స్వామి దాసు, ముగతి దేవపాల్, పొణకల దిన్నె లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రామజల చెరువు

- జలమయమైన కాలనీలు - ఇబ్బందులు పడ్డ లోతట్టు ప్రాంతాల వాసులు

ప్రజాశక్తి - ఆదోని

దంచి కొడుతున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఇళ్లల్లోకి నీరు చేరి నిత్యావసర సరుకులు తడిసిపోతున్నాయి. రెండు రోజులుగా భారీ వర్షం కురిసింది. 124 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్రం కూడా భారీ వర్షం కురిసింది ఏకధాటిగా కురిసిన వర్షంతో రామజల చెరువులోకి బారిగా నీరు చేరి నిండా కుండలా మారింది. సమీప కొండల మధ్యనున్న ఎర్రచెరువు , మంటి గుంతల నుండి భారీగా రామజల చెరువుకు నీరు చేరుతుంది చెరువు కడగం నిండింది. చెరువు నుండి నీరు భారీగా కిందికి పారడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. రామ జల కడగం నిండి వంక లోకి నీరు ప్రవహిస్తుంది. ఆ వంక ఆదోని పట్టణంలోని జ్యోతిర్మయి కాలేజ్, నేషనల్ స్కూల్, ఆదిత్య నర్సింగ్ హోమ్, కూనిమల్, బార్పేట్, వడ్డే గేరి, బుడ్డేకల్, బోయగేరి , రాయ నగర్ మీదుగా బసాపురం వంకకు చేరుకుంటాయి ఆ వంక సమీపాన ఉండే నూనిగెరి, బోయగేరి, వడ్డే గేరి ప్రాంతాలలో వంక పొంగి పొర్లి ఇల్లల్లోకి నీరు చేరాయి. నిత్యవసర సరుకులు తడిచి ఇల్లంతా తడిచి ఉండడంతో నిద్ర లేక రాత్రంతా జాగారం చేశామని స్థానికులు చెప్పారు. పట్టణ శివారులోని రాజసాబ్ నగర్ లోకి పొలాల వెంబడి నీరు కాలనీలోకి చేరడంతో ఇళ్లు జలమయమయ్యాయి.

రాత్రంతా జాగారం: ఈరమ్మ ,రాజాసాబ్ కాలనీవాసి

భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతమైన రాజ సాబ్ నగర్ జలమయమైంది అక్కడ ఎలాంటి రోడ్లు డ్రైనేజీ సదుపాయం లేకపోవడం వల్ల నీరు అలాగే నిలిచిపోయాయి. పొలాలు గట్టు తెగి నీళ్లు భారీగా ఇళ్ల మధ్యకి చేరడంతో రాత్రంతా జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలనీలోకి నీళ్లు రాకుండా గట్టు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నా తాత్కాలిక పనులు చేస్తున్నారే తప్ప రోడ్లు డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు చెబుతున్నారు.

రామజల చెరువునుంచి పట్టణంలోకి వస్తున్న నీరు

లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేశాం: కష్ణ మున్సిపల్ కమిషనర్ ఆదోని

ఆదోని పట్టణం పై బాగానే ఉన్న రామజ ల చెరువు కు భారీగా నీరు చేరింది. చెరువు నీటి సామర్థ్యం 12 00 మిలియన్ లీటర్లు ఉంది . భారీగా వర్షపు నీరు చేరడంతో నిండుకుండలా మారింది. ప్రస్తుతం కడగం పొంగిపొర్లుతుంది వంకకు అడ్డంగా ఉన్న కంపచెట్లు ముళ్ళపొదలు తొలగింపు చేస్తున్నాం ఆ నీరు పట్టణంలోకి ప్రవహిస్తున్న పరిస్థితి ఉంది .కున్ని మహల్, బుడేకల్, వడ్డెగేరి, బోయగేరి, ప్రాంతాల వాసులను అప్రమత్తం చేశాం. రాజలచెరువును సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కూడా పరిశీలించారు.చెరువు కట్ట పటిష్టంగా ఉందని ఎలాంటి ప్రమాదం ఉండదని ఇంజనీరింగ్ అధికారులు తేల్చి చెప్పారు. కడగం పొంగిపొరలి నీరు మాత్రమే ప్రవహిస్తుంది జై హింద్ వంక ఉధృతంగా ప్రవహిస్తుంది. శివశంకర్ నగర్, క్రాంతి నగర్, లేబర్ కాలనీ వాసులను అప్రమత్తం చేశాం. వంక సమీపంలో నివసిస్తున్న వారు వేరే ప్రాంతానికి వెళ్లాలని సూచించాం. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులకు ప్రభుత్వం చేశాం. ఎవరు భయపడవద్దు. ఇబ్బందులు లేకుండా చూస్తాం.

కౌతాళంలో కుండపోత వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-కౌతాళం

కౌతాళంలో కుండపోత వర్షం కురిసింది. శనివారం కురిసిన భారీ వర్షానికి జన జీవనం అతలాకుతలమైంది. వంకలు వాగులు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమాలమై ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. భారీగా కురిసిన వర్షానికి హనుమన్ నగర్ వైఎస్ఆర్ నగర్, మంచాలు వీధి, పోస్ట్ ఆఫీస్ విధి తదితర కాలనీలలో నీళ్లు భారీగా ప్రవహించాయి. అనేకమంది ఇళ్లలో వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. పాత బస్టాండ్, కొత్త బస్టాండు, వైఎస్ఆర్ సర్కిల్, వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్మీ నగర్, రౌడూరు, కౌతాళం, బాపురం వంకలు పొంగి పారడంతో గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. అనేక చోట్ల డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

ఆరోగ్యవంతమైన గ్రామమే లక్ష్యం

-డిప్యూటీ ఎంపీడీఓ సందీప్

ప్రజాశక్తి నందవరం

ఆరోగ్యవంతమైన గ్రామమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ సందీప్ తెలిపారు. ఆయన శనివారం కనకవీడు గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో వీధి వీధిన తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. డోర్‌టుడోర్ గార్బేజ్ కలెక్షన్ ప్రాధాన్యతను వివరించారు. చెత్త సేకరణ ప్రతి గ్రామంలో జరుగుతుందా, లేదా విషయంపై ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం వివరణ కోరుతారు. ఆ సమయంలో ప్రజలు స్పందించి ఉన్న పరిస్థితులను తెలపాలని అవగాహన కల్పించారు. చెత్త బండి మీ ఇంటికి వచ్చినప్పుడు తడి, పొడి చెత్త సపరేట్గా ఇచ్చి హరిత రాయబారులకు సహకరించవలెనని, బిన్ బ్యాగ్ పద్ధతిని పాటించవలనని సూచించారు. పరిసరాలను, గహాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడంలో భాగ్య స్వాములు కావాలని ప్రజలకు సూచించారు. నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని అన్నారు. జ్వరం, దగ్గు, జలుబు వస్తే స్థానికంగా ఉన్న యం యల్ హెచ్, ఎఎన్ఎం, ఆశ వర్కర్ల ద్వారా ప్రథమ చికిత్స తీసుకోవాలని సూచించారు. నిత్యం డ్రైనేజీలు శుభ్రపరచాలని, ఒ హెచ్ఎస్ ఆర్ ట్యాంక్ క్లీన్ చేపించి క్లోరినేషన్ చేయించి ప్రజల ఆరోగ్యమైన జీవితానికి అధికారులు, గ్రామ సేవకులు కృషి చేయాలని తెలిపారు. పైపులైన్లు ఎక్కడ కూడా లీక్ కాకుండా రిపేర్ చేయించి ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని పంచాయతీ కార్యదర్శి,గ్రామ సర్పంచికి తెలిపారు.

- అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సందీప్

విజయనగర్ కాలనీలో సమస్యల తిష్ట

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో విజయనగర్ కాలనీవాసులు పందుల మధ్యలో జీవనం కొనసాగిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి, మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శనివారం ఆదోని పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఆమె పర్యటించారు. వర్షపు నీరు ఇళ్ల మధ్యలోనే నిలిచి ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆమె దృష్టి తెచ్చారు. ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో నిత్యావసర సరుకులు తడిచిపోయాయని, తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలంటు ఆమె ముందు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, డ్రెయినేజీలు సరిగ్గా లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వీధులన్నీ జలమయం అవుతున్నాయని వాపోయారు. నివసించడానికి చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలు ఉన్నాయని ఇక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్నామన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు లేని కారణంగా ఇళ్ల మధ్యలోనే నీరు నిలిచి బురదమయంగా మారడంతో నడవడానికి అనుకూలంగా లేదన్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండేగిరి బాబురావు, కార్వాన్ పేట లక్ష్మీనారాయణ, నాగరాజ్, భరత్, రాఘవరెడ్డి, విజయ్, రసూల్, కానీవాసులు పాల్గొన్నారు.

కోటకొండ వివోఏ చేతివాటం

- స్త్రీ నిధి రుణాల రికవరీ డబ్బులు స్వాహా
- మహిళలు నిలదీయడంతో తిరిగి ఇచ్చిన వైనం
- చర్యలు తీసుకోవాలని మహిళల డిమాండ్

ప్రజాశక్తి - దేవనకొండ

పొదుపు సంఘాల పనితీరు, రుణాల మంజూరు, చెల్లింపుల, సమావేశాలు నిర్వహణ సక్రమంగా చూసుకోవాల్సిన వివోఎ స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో చేతివాటం ప్రదర్శించాడు. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని పి-కోటకొండ గ్రామంలో ఝాన్సీలక్ష్మి, లలిత పొదుపు సంఘాల స్త్రీనిధికి సంబంధించిన రుణాలు బ్యాంకులో డిపాజిట్ చేయకుండా స్వాహా చేశాడని ఆయా సంఘాల లీడర్లు బజారమ్మ, లక్ష్మీదేవి శనివారం ఆరోపించారు. ఝాన్సీ లక్ష్మి పొదుపు సంఘం నుండి రు.1లక్షా47వేలు, లలిత పొదుపు సంఘం నుండి రూ.62వేలు స్త్రీనిధికి సంబంధించిన చెల్లింపుల డబ్బు స్వాహా చేసినట్లు ఆరోపించారు. పొదుపు సంఘం బ్యాంకు ఖాతా నుండి స్త్రీ నిధి రుణానికి జమ అయ్యేలా బ్యాంకులో లింకు చేసినట్లు తెలిపారు. పొదుపు ఖాతాలో జమ చేసిన డబ్బులు లేవని స్త్రీనిధి రుణానికి కట్ అవుతున్నాయని బ్యాంకు మేనేజర్ తెలపడంతో పొదుపు సంఘాల మహిళలు వివోఎ ఇంటి వద్దకు వెళ్లి నిలదీశారు. మా డబ్బులు ఇవ్వకపోతే కేసు పెడతామని బెదిరించడంతో స్వాహా చేసిన సొమ్మును తిరిగి ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై ఏపీఎం మాదుల లక్ష్మమ్మను ప్రశ్నించగా వివోఎపై వచ్చిన అవినీతి ఆరోపణలు వాస్తవమేనని, విచారణ చేపట్టి వాస్తవాలు తేలితే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థి దశ నుండే క్రీడల్లో ఆసక్తి చూపాలి

-విద్యార్థులకు క్రీడా దుస్తువులు పంపిణీ -వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి -మంత్రాలయం

విద్యార్థి దశ నుండే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి చూపినప్పుడే రాణించగలరని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తుంగభద్ర విద్యార్థిని విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు 30 జతలు క్రీడా దుస్తులను బహుమతిగా ఇచ్చామన్నారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. విద్యార్థులు జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు తమ వంతు ప్రోత్సాహం సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో జరగబోయే టోర్నమెంట్స్‌లో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు , గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు వై ప్రదీప్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రంగస్వామి భౌతక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రభాకర్ , తదితరులు

రంగస్వామి కుటుంబానికి చంద్రన్న బీమా ఇవ్వండి

ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కుటుంబానికి అండగా ఉన్న యజమాని మరణిస్తే ప్రభుత్వాలు బీమా కింద ఆర్థిక సహాయం చేసేవారని ఇప్పుడు ఎలాంటి బీమాలు వర్తింప చేయడం లేదని, గత 21 సంవత్సరాలుగా ఆటోనడుపుతూ షరీన్ నగర్ లో జీవనం సాగిస్తున్న ఐటిసి ఆటో స్టాండ్ సిఐటియు కార్యకర్త డి. రంగస్వామి (దుబ్బన్న)46 శనివారం హటాత్తుగా గుండె పోటుతో మరణించారు. విషయం తెలిసి సిఐటియు ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ , ఆటో యూనియన్ న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి. రాధాకృష్ణ. అధ్యక్షులు హుస్సేన్ వలి, 31వ వార్డు సిపిఎం నాయకులు ఏసు. ఆటో యూనియన్ నగర నాయకులు శీను. తదితరులు రంగస్వామి నివాసానికి వెళ్లిపార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఆటో వృత్తిని చేసుకుంటూ ఆటో డ్రైవర్ల సమస్యల కోసం సిఐటియు ఇచ్చిన పిలుపుల్లో రంగస్వామి చురుకుగా పాల్గొనేవాడన్నారు. రంగస్వామి మరణం చాలా బాధాకరమని, కుటుంబ యజమాని మరణం వల్ల ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం పిఎఫ్, ఇఎస్ఐ, ఉచిత ప్రమాద బీమా లాంటి సౌకర్యం కల్పించి ఉంటే ఆ కుటుంబానికి అండగా ఉండేదన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం చంద్రన్న బీమా కింద సహజ మరణానికి రూ.రెండు లక్షలు అప్పుడు ఈచ్చారని ,చంద్రన్న బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రంగన్న కుటుంబానికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గుత్తి పెట్రోల్ బంక్ ఐటిసి ఆటో స్టాండ్ డ్రైవర్లు చంద్ర, పొట్టిరాజు, షారు, రాము, నరసిహా,షరీఫ్, తిమ్మప్ప, రాజు, మౌలలి,దుర్గా, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన మధ్యంతర భృతిని(ఐఆర్) దసరా పండగకు ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్‌టియు రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి. వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దసరా పండగకు 30శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటి వరకు నాలుగు డీఏలు పెండింగ్లో ఉన్నాయని, కనీసం రెండు డీఏలు అయినా దసరా పండగకు ప్రకటించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలు అలాగే పెండింగ్లో ఉన్నాయని ఎస్‌టియు నాయకులు జి. శ్రీనివాసులు, బి. శ్రీనివాసులు, జయరాం, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా చైర్మన్లు నిలవాలి

-కాయిలాపడ్డ బ్యాంకులకు కూడా రూ. కోటి రుణనిధి
-రికవరీలపై దృష్టి సారించాలి --కెడిసిసిబి చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు రైతులకు సకాలంలో రుణాలు ఎరువులు అందజేసి అండగా నిలవాలని కెడిసిసిబి చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం కర్నూలు నగర శివారులోని కె. ఫార్చ్యూన్ ఫంక్షన్ హాలులో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల సమీక్ష సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. మొదటగా కెడిసిసిబి కర్నూలు జిల్లా సిఇఒ రామాంజనేయులు, బ్యాంకు అభివృద్ధి లోడ్పాట్లను గురించి సమావేశానికి వివరించారు. అనంతరం డి.విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయని అన్నారు. అందులో 46 సంఘాలు మాత్రమే రైతులకు రుణాలు అందించేందుకు అర్హతను సాధించాయన్నారు. ఈ పరిస్థితికి కారణం గతంలో పనిచేసిన వైసిపి ప్రభుత్వమే కారణమన్నారు. అర్హత, అనర్హతలను నిబంధనలు ఏవి పాటించకుండా తమకు నచ్చిన వారికి రుణాలను అందజేశారని, తిరిగి వాటిని రికవరీ చేయడాన్ని గాలికి వదిలేసారని అన్నారు. తద్వారా బ్యాంకులు నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. చివరికి తిరిగి రైతులకు రుణాలు ఇచ్చే అర్హతను బ్యాంకులు కోల్పోయే దృష్టికి వైసిపి ప్రభుత్వం దిగజార్చిందన్నారు. ప్రతి సంఘ పరిధిలో అవకాశాన్ని అవసరాలని బట్టి లాకర్లను బిల్డింగు పునరుద్ధరణను పెట్రోల్ బంకులను కాంప్లెక్స్‌లను నిర్మించడానికి మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అందుకు కావలసిన ప్రతిపాదనలను ఆయా సంఘాల చైర్మన్లు సిఇఒ ల ద్వారా ప్రణాళికలను తయారుచేసి తమ వద్దకు పంపితే వాటిని పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో రూ.34 కోట్లు విలువచేసే నిరర్థక ఆస్తులుగా (ఒటిఎస్) గుర్తించామన్నారు. గతంలో ఆరు సంవత్సరాలుగా మొండి బకాయిలుగా మిగిలిన వాటికి మాత్రమే ఒటిఎస్ అమలు చేసే వారని, దాన్ని ప్రస్తుతం నాలుగు నుంచి ఆరు సంవత్సరాల లోపు మధ్య మొండి బకాయిగా ఉన్న అకౌంట్ దారులను కూడా ఒటిఎస్ కిందికి పరిగణించి, నిజమైన అర్హత ఉన్న వారిని మాత్రమే ఆ జాబితాలో

చేరుస్తామన్నారు. పంట రుణాల కోసం రూ 80 కోట్లు రుణ నిధిని సంఘాలకు ఇస్తే కేవలం 20 కోట్లు మాత్రమే రుణాలుగా రైతులకు అందించడం బాధాకరమన్నారు. వెంటనే చైర్మన్లు అధికారులు వీటిని ఎందుకు ఇవ్వలేదో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఇచ్చిన రుణాల్లో కనీసం 50శాతం రికవరీ చేయని బ్యాంకులకు రుణ నిధిని మంజూరు చేసే అవకాశం గతంలో లేదని, అయితే ప్రత్యేకంగా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నష్టాల్లో ఉన్న బ్యాంకులకు సైతం రుణ నిధి కింద రూ .1కోటి రుణ నిధిని అందజేయనున్నట్లు తెలిపారు. అయితే రుణాల రికవరీ కి సంఘాల చైర్మన్లు భరోసా ఇస్తేనే అది నెరవేరుతుందన్నారు. గ్రామాల్లో స్వయం సహాయక గ్రూపులకు బయటి బ్యాంకులు దాదాపు 12 శాతం వడ్డీ రేటు తో రుణాలు అందిస్తున్నాయని మన సహకార సొసైటీ బ్యాంకుల్లో దాన్ని కేవలం నూటికి 20 పైసలు వడ్డీతో మాత్రమే రుణాలు అందించనున్నామన్నారు.టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి మాట్లాడుతూ... రైతుల సేవ చేసే భాగ్యం సొసైటీల చైర్మన్ లకు అత్యధికంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపద సృష్టించిన వారికే ఖర్చుపెట్టే అర్హత లభిస్తుందని విశ్వసిస్తారని, ఆ మేరకు సొసైటీ సంఘాల చైర్మన్లు బ్యాంకులను లాభాల బాటలో నడిపించేలా కృషి చేయాలన్నారు. నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్ ,కెడిసిఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సిఇఒలు కె. రామాంజనేయులు, రామాంజనేయులు, కర్నూలు జిల్లా డిసిఒఎం పేరు ఏం పేరు వెంకటకష్ణ, బ్యాంకు చీఫ్ మేనేజర్, ఇతరత్రా అధికారులు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి

శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహాం చెల్లింపు

ప్రజాశక్తి -కర్నూలు లీగల్

జాతీయలోక్ అదాలత్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలతో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి జి. కబర్థి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాలలో 8122 కేసులు పరిష్కారం అయ్యాయి. శ్రీశైలం ప్రాజెక్టు భూనిర్వాసితులలో 60 మంది రైతుల వారసులకు రూ.83,96,374 నష్టపరిహారాన్ని జిల్లా జడ్జి వారి చేతుల మీదుగా ఇచ్చారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మొత్తం రెండు జిల్లాల్లో 20 బెంచీలను ఏర్పాటు చేసి 8122 కేసులను పరిష్కరించామని తెలిపారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి కమలాదేవి, ఆరవ అదనపు జిల్లాజడ్జి వాసు, సిబిఐ కోర్టు జిల్లాజడ్జి శోభారాణి, కర్నూలు బార్ ప్రసిడెంట్ హరినాథ్ చౌదరి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, రిటైర్డ్ అదనపు జిల్లాజడ్జి లక్ష్మీనరసింహారెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ , జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, కోర్టుమానిటరింగ్ సిఐ. రామానాయుడు, న్యాయ వాదులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తాం

-బండలాగుడు పోటీల ప్రారంభ సభ లో ఎమ్మెల్యే బివి

ప్రజాశక్తి - గోనెగండ్ల



ఉల్లిరైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే తెలిపారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో శ్రీచింతల ముని నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల సందర్భంగా శనివారం జిల్లా పరిషత్ హై స్కూలు ప్రాంగణంలో ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో ఒంగోలు ఎద్దుల బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బివి నాగేశ్వరరెడ్డి స్వయంగాఎద్దులను తొలి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ట్రాక్టర్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను పూలమాల శాలువాతో వద్ద ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దశమి ఉత్సవాలను పురస్కరించుకొని ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీలను గోనెగండ్లలో భారీ ఎత్తున ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే వర్షాలు రావని విమర్శించిన వారు ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలను చూసి నోట మాట పెగలడం లేదని అన్నారు. మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు నీటితో కలకలలాడుతూ పరవళ్ళు తొక్కుతుందన్నారు. మండలంలో 1800 ఎకరాల్లో రైతులు ఉల్లి సాగు చేస్తే అధిక వర్షాలకు 1500 ఎకరాల్లో ఉల్లి పంట పూర్తిగా నష్టపోయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు త్వరలో జరిగే అసెంబ్లీలో ప్రస్తావించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి వారిని ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతల ముని నల్లారెడ్డి స్వామి దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్‌వి.రామాంజనేయులు టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు టౌన్ ప్రెసిడెంట్ మహల్ రహంతుల్లా, బేతాళ బడేసా, నజీర్ సాహెబ్, పూజారి చంద్రశేఖర్, మదీన, గౌండ రహమతుల్లా, కాంట్రాక్టర్ షేక్షావలి, రాంపురం రంజాన్, రఫీక్ ట్రాక్టర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-మంత్రాలయం

మండల కేంద్రమైన మంత్రాలయంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారి నుంచి 28860 /-రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శివాంజల్ తెలిపారు. శనివారం స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న బసిరి చెట్టు వద్ద పేకాటతున్న గాలీ రామాంజితో పాటు మరో 7 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముళ్ల పొదలు తొలగింపు

ప్రజాశక్తి - కోడుమూరు

కోడుమూరు మండల కేంద్రంలోని కొండపేటలో రహదారికి ఇరువైపులా అడ్డంగా ఉన్న ముళ్లపదలను శుక్రవారం తొలగించారు.కెడిసి సి సి బి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ అధికారులు, సర్పంచి భాగ్యరత్న, సిబ్బంది సహకారంతో ఇరువైపులా ముళ్ళ పొదలు తొలగించారు. దీంతో సర్పంచును పలువురు అభినందించారు.కోడుమూరు పట్టణ టిడిపి అధ్యక్షులు గంగాధర్ నాయుడు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

యుటిఎఫ్ రణబేరి ప్రచార యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

ఈనెల 15 నుండి తలపెట్టిన రణబేరి ప్రచార యాత్రను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నాగమణి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, సుధాకర్ కోరారు. శనివారం పట్టణంలోని నీలకంఠేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రణబేరి ప్రచార యాత్ర కరపత్రాలను ఆవిష్కరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యారంగ ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్బన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, లింగమూర్తి మాట్లాడుతూ ప్రచార జాతా ఎమ్మిగనూరు మధ్యాహ్నం చేరుకుంటుంది. మధ్యాహ్నం ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ కమిటీ సభ్యులు వై రామాంజనేయులు సీనియర్ నాయకులు మల్లారి నాగరాజు మల్లారీ భీమేష్ భాస్కర్, హనుమంతు , మాదన్న, నాగరాజు సంపత్, రామ్మోహన్ మాదన్న మరికొంతమంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేద్దాం

ప్రజాశక్తి ఆదోని

సిపిఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు సూచించారు. ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదోని సుందరయ్య భవన్‌లో రాజ్యాంగం – సోషలిజం, లౌకికవాదం పై మతోన్మాదం మితవాద శక్తుల దాడి అనే అంశం పై స్టడీ సర్కిల్ సర్కిల్ జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు పని చేసిన ఘనత సీతారాం ఏచూరి కి దక్కిందన్నారు. ఇబ్బందులు ఉన్న జాతీయ స్థాయిలో పార్టీని ,క్యాడర్ ను ఒకే తాటి పై నడిపి ముందుకు సాగారన్నారు.సీనియర్ నాయకులు రాంజినేయులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అంచెలుగా ఎదిగి జాతీయ ప్రధాన కార్యదర్శి గా సేవలు అందించి అందరివాడుగా ఏచూరి మెలిగారన్నారు. పార్టీ తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి నాయకులు కార్యకర్తలు నడుచుకొని ఆశయ సాధన కోసం సమిష్టిగా కృషి చేద్దామన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, నాయకులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, వీరారెడ్డి.నాగరాజు,అయ్యప్ప,వెంకటేష్,హనుమంతరెడ్డి వున్నారు.

ఆదోనిలో సీతారామ్ ఏచూరి సంతాపసభలో మాట్లాడుతున్న వెంకటేశులు

పేదల సహకారి చంద్రబాబు నాయుడు

-టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల పాలిట దేవుడిగా ఆదుకుంటున్నాడని టిడిపి పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ఎన్ రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 40 కుటుంబాలకు రూ.15,77,420 మంజూరు కాగా మంత్రాలయం మండలంలో 10 మందికి గాను రూ.4,49,227, కౌతాళం మండలంలో 11 మందికి గాను రూ.4,61,675 పెద్దకడబూరు మండలంలో 11 మందికి గాను రూ.4,13,694 , కోసిగి మండలం 8 మందికి గాను రూ.2,52,824 అందించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారని ప్రశంసించారు. మంత్రాలయం మండల నాయకులు మాజీ జడ్పిటిసి లక్ష్మయ్య, వరదరాజులు క్లస్టర్ ఇంచార్జి, సొసైటి డైరెక్టర్ చాపల నాగేష్, సొసైటీ డైరెక్టర్ డిసి తిమప్ప, ఎంపిటిసి వెంకటేష్,కోసిగి మండల నాయకులు మండల అధ్యక్షులు రామిరెడ్డి, ముత్తా రెడ్డి, మాజీ జడ్పిటిసి రామకృష్ణ, తాయన్న, కౌతాళం మండల నాయకులు సతీష్ నాయుడు, టిప్పు సుల్తాన్, అడివప్ప గౌడ్, పెద్దకడబురు మండల నాయకులు బసలదొడ్డి ఈరన్న,మల్లికార్జున,మురళి క్లస్టర్ ఇంచార్జ్ , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జెఎన్‌టియు అనంతపురం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ పోటీలో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థుల బృందం మొదటి బహుమతి సాధించి కళాశాల ప్రతిష్టను మరింత పెంచింది. ఈ విజేతబృందం రూపొందించిన ప్రాజెక్ట్ Quantum State Simulator — క్వాంటం కంప్యూటింగ్ రంగంలో వినూత్నతను, సాంకేతిక నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తూ న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది. విజేత బృంద సభ్యులుగా ఎం.ఎస్. బిజిన్ దేవారెడ్డి, పల్లె లాహరి రెడ్డి, ఎ.హనీ, జి అమరేశ్వర ప్రసాద్ రెడ్డి, బి.ప్రణవ్ సాయి, వై.రామ దీక్షితులు ఉన్నారు. ఈ బృందం చూపిన సాంకేతిక ప్రతిభ, సహకార భావం, నవీన ఆలోచనలకు అభినందనలు తెలియ జేస్తూ, కళాశాల తరపున వారికిహృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం విద్యార్థుల కృషికి, మార్గదర్శకుల ప్రోత్సాహానికి జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనంగా నిలిచిందన్నారు. వారి విజయానికి జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేసింది.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కోసిగి

మండల పరిధిలోని చిర్తనకల్ గ్రామంలో ఉన్న పాఠశాలలో శుక్రవారం, శనివారం రెండు రోజులు కురిసిన వర్షాలకు గాను తెల్లవారుజామున పాఠశాలలో ఉన్న మొదటి అంతస్తులో పెచ్చులూడి తరగతి గదిలో పడినట్లు గ్రామస్తులు తెలిపారు. పాఠశాలలో 1 నుండి 10వ తరగతి వరకు 384 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కింద మూడు గదులు పైన మూడు గదులు ఉన్నాయి. ఈ పాఠశాల నిర్మాణం 2014 నుండి 15 మధ్యలో నిర్మించారు. 2017 సంవత్సరంలో ప్రారంభించారు. నిర్మించిన ఏడు సంవత్సరాల లోనే తరగతి గదిలో పెచ్చులూడి పడడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లేకుండా నిర్మించారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేకపోయేసరికి పెను ప్రమాదం తప్పిందని విద్యార్థులు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులు ఉన్నప్పుడు ప్రమాదం జరిగి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. చేసేదేమీ లేక ఆరు బయటనే తరగతులను నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి శిథిలావస్థలో చేరిన పాఠశాలలను బాగు చేయించి , కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

సంజీవయ్య సాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతు దృశ్యం

హంద్రీ నదికి జలకళ

పెరిగిన పర్యాటకులు

ప్రజాశక్తి- కోడుమూరు

కోడుమూరు పట్టణంలో శుక్రవారం సాయంత్రం గోనెగండ్ల మండలం గాజులదిన్నె సంజీవయ్య సాగర్ ప్రాజెక్టులో వరద ప్రవాహం కొనసాగుతుంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా శుక్రవారం 3.8 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. 15 క్యూసెక్కుల ఇంఫ్లోతో వరద ముంపు పెరుగుతుందని టిడిపి చైర్మన్ మల్లికార్జున గౌడ్, కోడుమూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎల్లప్ప నాయుడు ఆధ్వర్యంలో అధికారులు రెండు గేట్లు ఎత్తి 2000 క్యూసెక్కుల నీటిని దిగువ హంద్రీకి వదిలారు. ప్రాజెక్టు దిగువన ఉన్న హంద్రినది జలకళను సంతరించుకుంది ఈ నీటి ప్రవాహాన్ని చూడటానికి సందర్శకుల సంఖ్య పెరిగింది.

ఎట్టి ఆవుల నుండి పంటలను కాపాడండి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలో ఉదయం ఆవులు విచ్చలవిడిగా తిరుగుతూ ట్రాఫిక్ కు ఇబ్బందులు పెడుతూ రాత్రి వేళల్లో గ్రామ శివారులో ఉన్నటువంటి పొలాలు లోకి వెళ్లి పంటలు నాశనం చేసి వేల రూపాయలు నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతూ సిపిఎం ఆధ్వర్యంలో పత్తికొండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సిఐ జయన్నకు వినతిపత్రం అందజేశారు. సిఐ జయన్న మాట్లాడుతూ సోమవారం 10 గంటలకు ఆవుల యజమానులు ఎవరైనా ఉంటే ఆవులను తమ ఇంటిదగ్గర కట్టేసుకోవాలిందిగా విజ్ఞప్తి చేశారు. ఆవుల యాజమాన్యలు నిర్లక్ష్యం చేస్తే సాయంత్రం ఆవులు గోశాలకు తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్రతో పాటు రామాంజి రామాంజి రంగన్న రామరాజు భీమా సీను కాశి వీరేష్ కే రామంజి నాగరాజు 30 మంది రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి

క్షేమంగా గమ్యం చేరండి

ప్రజాశక్తి-ఆదోని

రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ పై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పని సరి అని ఆదోని ట్రాఫిక్ సిఐ అబ్దుల్ గౌస్ తెలిపారు. ఆదోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ లో రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై డ్రైవర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహనాలను నడిపే ఆటో డ్రైవర్లు మద్యం సేవించి నడపరాదన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు.ప్రతి వాహనానికి రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. ఇన్సూరెన్స్ విధిగా చేయించాలన్నారు. ఆటో లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ఆటో డ్రైవర్ యూనిఫారం ధరించాలని మైనర్లు వాహనం నడపరాదని సూచించారు. నిబంధన అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లక్ష్మయ్య పోలీసులు వున్నారు.

యాంటి లార్వా ద్రావణం పిచికారి

ప్రజాశక్తి-చిప్పగిరి

నగర డోన గ్రామంలో దోమల వ్యాప్తి చెందకుండా యాంటీ లార్వా ద్రావణం ను స్ప్రే పిచికారి చేయించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి సిసింద్రీ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ మాట్లాడుతూ గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో ఉన్నతధికారుల ఆదేశాల మేరకు గ్రామమంతా యాంటీ లార్వా ద్రావణ స్ప్రే చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మురికికుంటలను, గుంతలను, గ్రావెల్ వేయించి, నీటి నిల్వ ఉండకుండా, గ్రామ సర్పంచ్ మల్లమ్మ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు వారానికి ఒకసారి శుభ్రం చేస్తున్నట్లు తెలియజేశారు. మహిళలు ముఖ్యంగా తమ ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రం చేసుకొని, మంచినీరును వేడి చేసుకుని తాగాలని ప్రజలకు సూచించారు. సర్పంచ్ భర్త నాగేంద్ర పాల్గొన్నారు.